క్లుప్తంగా

ముస్తాబైన అన్నపూర్ణాదేవి ఆలయం



భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలో ఈ నెల 29న జరగనున్న శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తైనట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి శనివారం చెప్పారు. ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా 29వ తేదీ ఉదయం 7గంటలకు దుర్గా హరిబాబుస్వామి(తెనాలి) పర్యవేక్షణలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవతా మూర్తులకు నూతన వస్త్రాలంకరణ పూజలు జరుగుతాయన్నారు. 9గంటలకు మహా సంప్రోక్షణ, శాంతి హోమం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు అన్నపూర్ణాదేవి, కాశీ విశ్వేశ్వరస్వామి మహా శాంతి కల్యాణం, రాత్రి 7గంటలకు అన్నసంతర్పణ జరుగుతుందని వివరించారు.

పెదకళ్లేపల్లి పీహెచ్‌సీకి వీల్‌చైర్ అందజేత



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేతరాజు వెంకటేశ్వరరావు శనివారం పీహెచ్‌సీ డాక్టర్ హారికకు వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతీమణి కేతరాజు మల్లేశ్వరమ్మ, కుమారుడు రమేష్ వారి జ్ఞాపకార్థం రోగులకు సౌకర్యంగా ఉండేందుకు వీల్‌చైర్ అందజేసినట్లు తెలిపారు. డాక్టర్ శ్రీరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో పూర్ణాహుతి



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు గుండెపూడి నాగ రాజశేఖర్‌శర్మ బ్రహ్మత్వంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం 8 గంటలకు స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, నిత్యహోమాలు, శ్రీ ఫలహోమం, చండీహోమం, రుద్రహోమంతో, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించి అనంతరం అప్పగింతలను శాస్త్రోక్తంగా చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గూడూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన గూడూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గూడూరు పరిసర ప్రాంతాల పాఠశాలల్లోని విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ఆకట్టుకునే కళాకృతులతో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫకీరయ్యకు డాక్టరేట్



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ ఫకీరయ్యకు డాక్టరేట్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజైన్ అండ్ ఎఫ్‌పీజీ ఎ రియలైజేషన్ ఆఫ్ ఎనర్జీ ఎఫిసియంట్ మోడ్యూలర్ అరిథ్మెటిక్ ఆర్కిటెక్చర్స్ అనే అంశంపై ప్రచురించిన సిద్ధాంత గ్రంథానికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగం వారు డాక్టరేట్‌ను ఫకీరయ్యకు ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఫకీరయ్యకు కళాశాల చైర్మన్ గుడివాడ మెహర్‌ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దోసపాటి బాబా, తమ్మన సాయికుమార్ తదితరులు అభినందించారు.

పచ్చిరొట్టతో పంట దిగుబడి బాగు

- 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న ప్రభుత్వం
- రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధం
- పెడన నియోజకవర్గానికి 460 క్వింటాళ్ల పచ్చిరొట్ట పైరు విత్తనాలు



పచ్చిరొట్ట పైరు జీలుగ వేసిన రైతులు (ఫైల్)

పెడన: రైతు తాను వేసే పంట దిగుబడి బాగుండాలంటే ఆ మట్టి సారవంతమైనదిగానే కాకుండా పోషకాలు కలిగి ఉండాలనే ఉద్దేశంతో జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలు చల్లుకోవాలి. పూత దశకు రాగానే ఆ మొక్కలను మట్టిలో కలియదున్నాలి. ఇలా చేస్తే నేల సారవంతమవుతుందని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా రాయితీపై పచ్చిరొట్ట పైరు విత్తనాలను అందించడానికి సిద్ధమైంది.

సేంద్రియ కర్బన శాతం పెరగాలంటే..

ప్రస్తుతం పంట భూములలో సేంద్రియ కర్బన్ శాతం బాగా పడిపోయింది. దీనిని పెంచుకోవడానికే పచ్చిరొట్ట పైరు విత్తనాలు వేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. నిరుడు పెడన మండలంలో 250 క్వింటాళ్లు పిల్లిపెసర, జీలుగ, జనుము రాగా ఈ ఏడాది 175 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. వీటిని ఆయా రైతు భరోసా కేంద్రాలకు నేరుగా పంపించారు. రైతులు ముందుకు వచ్చి వీటిని వినియోగిస్తామంటే అవసరమైన మేర పచ్చిరొట్ట పైరు విత్తనాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని ప్రభుత్వం తెలియజేస్తోంది.

ప్రయోజనాలివీ..

పచ్చిరొట్ట పైరు విత్తనాలను నాటి పూత దశలోని మొక్కలతో పాటు కలియదున్నడం వల్ల అధిక ప్రయోజనాలు పొందవచ్చు. నేలలో నత్రజని స్థాపన జరిగి సారవంతం చేయడానికి ఉపకరిస్తాయి. దీంతో నేలలో సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువులు వినియోగం చాలా వరకు తగ్గుతుంది. తెగుళ్ల నివారణకు అవకాశం ఉంటుంది. రసాయన ఎరువుల కోసం పెట్టుబడి ఖర్చులు కలిసి వస్తాయి. రైతు అధిక దిగుబడులు వస్తాయి.

మొలక శాతం పరిశీలించి..

నేరుగా రైతు భరోసా కేంద్రాలకు చేరిన పిల్లిపిసర, జీలుగ, జనుము విత్తనాలను సంబంధిత ఆర్‌బీకేలకు చెందిన వీపీఏలు, ఎంపీఈవోలు మొలక కట్టారు. వచ్చిన విత్తనాలలో కొన్నిటిని తీసి పెడనలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌కు పంపించనున్నారు. మొలక శాతం బాగుంటే వాటిని రైతులకు ఇవ్వాల్సిందిగా ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

50 శాతం రాయితీపై..

ఆర్బీకేలకు వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలు నాలుగు, పది కిలోల బ్యాగుల చొప్పున వచ్చాయి. ఎకరానికి జీలుగ 12 కిలోలు, జనుము 16 కిలోలు, పిల్లి పెసర అయితే 8 కిలోల చొప్పున విత్తనాలు చల్లితే సరిపోతుంది. సబ్సిడీ పోను జీలుగ, జనుము కిలో రూ.44, పిల్లిపెసర కిలో రూ.67 వంతున ఇస్తున్నారు. ఒక రైతుకు ఐదు ఎకరాల వరకు ఇస్తారు. రైతు ఆర్బీకేకు వెళ్లి పట్టదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు ఫోన్ తీసుకువెళ్లాలి.

నాలుగు మండలాలకు సరఫరా ఇలా..

పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ప్రస్తుతం జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు సరఫరా అయ్యాయి. పెడన మండలానికి 175 క్వింటాళ్లు, గూడూరు మండలానికి 155 క్వింటాళ్లు, బంటుమిల్లి 80 క్వింటాళ్లు, కృత్తివెన్ను 50 క్వింటాళ్లు వచ్చాయి. మొదటి విడతగా వచ్చిన వీటిని రైతులు తాము ఇంకా కావాలని ఇండెంట్లు పెడితే మళ్లీ పంపిస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి దఫాలో 460 క్వింటాళ్లు పెడన నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాలకు పచ్చిరొట్ట పైరు విత్తనాలు చేరాయి.

చాలా ప్రయోజనాలు ఉన్నాయి..



మోతుబరి రైతులే కాదు, సన్న చిన్నకారు రైతులు కూడా వీటిని ఒకసారి వినియోగించి మంచి ఫలితాలు పొందారు. వారు మళ్లీ మళ్లీ తీసుకువెళ్లి వారి భూములను సారవంతం చేసుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వర్షపాతం తక్కువగా ఉన్నా వీటిని వినియోగించడం వల్ల ఎటువంటి ఇబ్బందులుండవు. పచ్చిరొట్ట పైరు విత్తనాలు వినియోగించుకోవడానికి, సబ్సిడీపై పొందటానికి రైతులు ఆసక్తి చూపించాలనే ఉద్దేశంతో ఆర్బీకేల పరిధిలో రైతులను చైతన్యపరుస్తున్నాం. పచ్చిరొట్ట పైరు వినియోగం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి.

–జీవీ శ్రీనివాసరావు, ఏవో, పెడన

నిరుపయోగంగా పర్యావరణ విజ్ఞాన కేంద్రం

- తాళాలు తెరవని అటవీ అధికారులు
- గోడలకే పరిమితమైన విజ్ఞాన విశేషాలు



కళావిహీనంగా పర్యావరణ విజ్ఞాన కేంద్రం



హంసలదీవి తీరంలో వసతులు సున్నా

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన పర్యావరణ విజ్ఞాన కేంద్రం నిరుపయోగంగా మారింది. సాగరతీర ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలోకి తీసుకురావడంతో ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ అధీనంలోకి తీసుకుంది. అటవీ అధికారులు హంసలదీవి కరకట్ట దిగువ ప్రాంతానికి అభయారణ్యంగా ప్రకటించి, ఈ ప్రాంతంలో ఎలాంటి కట్టడాలు, అభివృద్ధి పనులు చేయకుండా నిషేధించారు. 2004 పుష్కరాల సమయంలో అప్పటి ప్రభుత్వం పాలకాయతిప్ప బీచ్ వద్ద నిర్మించిన డాల్ఫిన్ భవనాన్ని, సాగరసంగమం వద్ద ఉన్న విశ్రాంతి భవనాన్ని అటవీ అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. విశ్రాంతి భవనంపై పర్యవేక్షణ లోపంతో ఆ భవనం శిథిలావస్థకు చేరింది. డాల్ఫిన్ భవనాన్ని సుందరీకరించి సుమారు రూ.50 లక్షలతో పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

- **పర్యాటకులకు కానరాని విజ్ఞాన విశేషాలు**

విజ్ఞాన కేంద్రంలో అభయారణ్యంలో కనిపించే అరుదైన పక్షి జాతులు, పునుగు పిల్లులు, వివిధ రకాల తాబేళ్ల జాతుల నమూనాలను సుందరంగా తీర్చిదిద్దారు. వీటితోపాటు మడ అడవుల పెంపక విధానం, సముద్ర జీవాల రక్షణకు అనుసరించాల్సిన అంశాలు, 1977 నాటి దివిసీమ ఉప్పెన చిత్రమాలికను విజ్ఞాన కేంద్రంలో పొందుపర్చారు. అయితే విజ్ఞాన విశేషాలు మొత్తం గోడలకే పరిమితమయ్యాయి. ఈ విజ్ఞాన కేంద్ర తాళాలను అటవీ అధికారులు తెరిచిన దాఖలాలు లేవని పర్యాటకులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన విజ్ఞాన విశేషాలను అధికారులు ప్రదర్శించకుండా తాళాలు వేయడంపై విమర్శలువ్యక్తమవుతున్నారు. విజ్ఞాన కేంద్రం తాళాలు తెరవాలని సిబ్బందిని కోరినా స్పందన ఉండటం లేదని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- **వసతులు కరవు**

తీరానికి వచ్చే పర్యాటకుల కోసం అధికారులు ఎలాంటి వసతులు ఏర్పాటు చేయలేదు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పాలకాయతిప్ప గ్రామానికి చెందిన పలువురు చిరువ్యాపారులు సాగరతీరంలో పర్యాటకులకు అవసరమైన తాగునీరు, తినుబండారాలు అమ్ముతుంటే, అటవీ అధికారులు వారిని కూడా అడ్డుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తీరంలో కనీస వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపునకు సర్వే



మాట్లాడుతున్న ఏడుకొండలు

గుడ్లవల్లేరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమీపంలోని పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త కె.ఏడుకొండలు తల్లిదండ్రులకు సూచించారు. 0–18 సంవత్సరాల దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు, నమోదు సర్వే కార్యక్రమాన్ని శనివారం గుడ్లవల్లేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అవసరాల పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లలతో కలిపి కూర్చోబెట్టడం ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో మేధోశక్తి, వికాసం పెరుగుతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులందరూ పిల్లలను పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫిజియోథెరపీ కేంద్రాలకు తీసుకెళ్లాలని, వారికి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సర్వే, నమోదు వచ్చే నెల 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు వి.విజయకుమారి, అబ్దుల్ హమీద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



గుడ్లవల్లేరు: సమాజంలో విద్య ద్వారానే గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని రత్నం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ మొవ్వా రామకృష్ణ పేర్కొన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏపీ ఉత్తర్వుల ప్రకారం 2023–24 విద్యా సంవత్సరాల్లో ప్రాంగణ ఎంపిక ద్వారా ఉద్యోగాలు పొందిన విద్యార్థులను గుర్తిస్తూ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ ఎచీవర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను ముఖ్య అతిథి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా డిప్లమో విద్యార్థిననీ, సాధారణ రైతు కుటుంబం నుంచి ఈస్థాయికి వచ్చానని, కేవలం రూ.350 వోచర్ పేమెంట్‌తో జీవితం స్టార్ట్ చేసి ప్రస్తుతం మంచి టర్నోవర్‌ను తన కంపెనీలు సాధిస్తున్నాయన్నారు. మన చుట్టుపక్కల ఉన్న సమస్యలను అవగాహనతో అర్థం చేసుకుని మనం నేర్చుకున్న విద్యతో వాటిని అధిగమించడానికి చేసే ప్రయత్నాలే మనల్ని ఉన్నత స్థానాలకు చేర్చుతాయన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, ఆయా శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకరించండి.. సమన్వయం పాటించండి

చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

కోనేరుసెంటర్: కౌంటింగ్‌ను పురస్కరించుకుని అల్లర్లు, అలజడలు జరగకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో శనివారం స్టేషన్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఆయా ప్రాంతాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 13న ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి పోలీసుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నట్లు చేశారు. కౌంటింగ్ ప్రాంతంలో 144 సెక్షన్ పక్కాగా అమలు చేస్తామన్నారు. నాలుగో తేదీన కృష్ణా విశ్వవిద్యాలయం సమీపంలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎక్కడ సభలు, సమావేశాలు, సంబరాలు జరుపుకునేందుకు అనుమతులు ఉండవన్నారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పోలీస్ ఆంక్షలు పాటిస్తూ ప్రజలను ఈ విషయంలో చైతన్యవంతులను చేసేందుకు ప్రజాప్రతినిధులు, పెద్దలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఘనంగా యల్లారమ్మ ఘటం ఊరేగింపు



ఊరేగింపుగా జల్దికి తరలిస్తున్న ఘటాలు

నాగాయలంక: స్థానిక సబ్బినేనిబజారులోని సబ్బినేనివారి ఇలవేల్పు యల్లారమ్మ జాతర మహోత్సవం శనివారం ప్రారంభమైంది. సబ్బినేని వంశీయులు, గ్రామస్తుల నేతృత్వంలో అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా నాగాయలంకలోని కృష్ణానదికి తీసుకెళ్లి శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లో పవిత్ర స్నానాలు చేయించారు. తర్వాత సంప్రదాయక రీతిలో రజక పూజారులు ఘటానికి విశేష పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల మీదుగా గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఉన్న జల్దిలో ఉంచారు. సాయంత్రం జల్ది నుంచి తరలించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఘటాలు గుడికి చేరుకున్నాక జాతర సంప్రదాయాల ప్రకారం సంబరం జరుపుతామని తెలిపారు. సబ్బినేని వంశీయులు, భక్తులు చద్ది నైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు చెల్లించుకుంటారని, ఈసందర్భంగా అన్నసంతర్పణ నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ సబ్బినేని భుజంగరావు చెప్పారు. కార్యక్రమంలో సబ్బినేని బాబు భవాని వరప్రసాద్, సబ్బినేని సురేష్, పెద్దలు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ అంశాలపై అవగాహనుండాలి



ఘంటసాలలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ఘంటసాల: వ్యవసాయ అనుబంధ అంశాలపై అవగాహన ఉండాలని ఘంటసాల పశువైద్యాధికారి డాక్టర్ పిన్నమనేని మనోజ్‌కుమార్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్లకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవంలో భాగంగా ఘంటసాల గ్రామంలో ఉంటున్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా శనివారం ఘంటసాలలోని ప్రభుత్వ పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరంలో సేవలు అందించారు. పశువులను పరీక్షించే సమయంలో, మందుల పంపిణీ, ఇతర సేవలను అందించారు. అనంతరం పశుపోషకులకు మినరల్ మిక్చర్, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఘంటసాలలోని పలువురు రైతులు, మహిళలకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రేగండ్ల మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, విద్యార్థినులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యాన మచిలీపట్నంలో నిర్వహిస్తున్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విజయవాడ రేంజ్ డీఐఎస్ మహమ్మద్ సాదతుల్లా తెలిపారు. ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఆసక్తి కలిగిన విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే విద్యార్థి రికార్డు షీటు, బదిలీ సర్టిఫికెట్, రూ.లక్షలోపు ఆదాయ ధ్రువపత్రాలతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చని ఆయన వెల్లడించారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతికి 59 సీట్లు, 7వ తరగతికి 55 సీట్లు, 8వ తరగతికి 54 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన విద్యార్థులు మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అర్హులని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మే 31లోపు మచిలీపట్నం చిలకలపూడిలోని వరలక్ష్మి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

రేపు కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు హుండీల కానుకల లెక్కింపు నిర్వహిస్తామని ఆలయ ఈవో మాధవీలత శనివారం తెలిపారు. దేవదాయ ధర్మాదయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శివరామకృష్ణక్షేత్రానికి రూ.51వేల విరాళం



కోడూరు: కోడూరులో నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి కోడూరు ఆర్ఐ సుభాషిణి–వెంకటేష్ దంపతులు రూ.51,116 నగదును శనివారం విరాళంగా అందించారు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న క్షేత్ర నిర్మాణానికి విరాళం అందించడం ఆనందంగా ఉందని ఆర్ఐ దంపతులు తెలిపారు. వారిని కమిటీ సభ్యులు సత్కరించారు. తన్నం వెంకటసుబ్బారావు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, రవిభాస్కర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దేవరకోట(ఘంటసాల): భూసారం మెరుగుపరుచుకోవడానికి పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట రైతు భరోసా కేంద్రం వద్ద 50 శాతం రాయితీ పై పచ్చిరొట్టి విత్తనాలను రైతులకు ఏవో మురళీకృష్ణ శనివారం పంపిణీ చేశారు. మురళీ కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ రైతులకు 50 శాతం సబ్సిడీ పై జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలను మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల ద్వారా 229.86 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు అందిస్తారన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్‌తో గ్రామ వ్యవసాయ సహాకులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ బి.సత్యదేవ్, దేవరకోట, దాలిపర్రు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

లీకేజీలు అరికట్టరూ..



మేదర్‌బజార్‌లో బంగారం కొట్ల వద్ద తాగునీరు వృథా



రామానాయుడుపేట గృహప్రియ ఫుడ్స్ వెనుక లీకేజీ

చిలకలపూడి(మచిలీపట్నం): తాగునీటి పైప్‌లైన్ లీకులతో నగర ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. నగరంలో రోజువిడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగా పలు ప్రాంతాల్లో పైప్‌లైన్లు పగిలి లీకులు ఏర్పడటంతో స్వచ్ఛమైన తాగునీరు వృథా అవుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీరు సక్రమంగా సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి ఈ లీకులతో నీరు వృథాగా పోతున్నా ఆ ప్రాంత ప్రజలు నగరపాలక సంస్థ అధికారులు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఆగమ పండితులు దీవి పార్థ వెంకటరామ శ్రీనివాసాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో వై శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

కురుమద్దాలి(పామర్రు): గ్రామానికి చెందిన ఎస్‌బీ పూర్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఫండ్ సౌజన్యంతో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి శనివారం నగదు బహుమతిని అంజేశారు. ఫండ్ అధినేత ఆముదాలపల్లి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతిలో 574 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన ఇంటూరి లీలా తన్మయ్‌ను అభినందిస్తూ రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పాంచజన్యకుమార్

అవనిగడ్డ: స్థానిక గాలిగోపురం సమీపంలోని శ్రీధన్వంతరీ ఆయుర్వేద వైద్యశాలలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వందమందికి ఎముకల సాంద్రత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దీవి పాంచజన్యకుమార్ ఆధ్వర్యంలో జండూ ఫార్మసీ ఆర్థిక సహాకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్ పి.కుమార్, డాక్టర్ డి.భావన వైద్యపరీక్షలు చేసి పలు సూచనలు సలహాలు అందించారు.